క్లుప్తంగా

కాత్యాయనీదేవిగా రాజరాజేశ్వరి



పూజలు అందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జె.గుమడాంలో కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

బొండపల్లి: మండలంలోని ఎ.గుమడాం పంచాయతీ పరిధి జె.గుమడాం, యడ్లపాలెం తదితర గ్రామాల్లో రెండు రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ మంత్రి చిన్నమ్మ పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు గ్రామంలోని వీధి కాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి గోవింద, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

మోటార్, పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్ మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ అధికారులు

గజపతినగరం: ఎం.వెంకటాపురం గ్రామంలో పాడైన మోటారు, పైపులైన్‌ను పంచాయతీ సిబ్బంది శుక్రవారం బాగుచేశారు. మోటారు పాడవ్వడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందంటూ స్థానికులు సర్పంచ్ కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి రమణ దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంటనే స్పందించారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మోటారు, పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో లెక్కలు చేయిస్తున్న ఎంఈఓ

వేపాడ: మండలంలో చామలాపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు కాసేపు గణితం బోధించారు. చిన్నచిన్న లెక్కలు ఇచ్చి బోర్డుపై చేయించారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించి వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ కచ్చితంగా అమలు జరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల దీక్ష



కార్మాగారం వద్ద దీక్ష చేస్తున్న కార్మికులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం సమీపంలో ఉన్న జిందాల్ స్టీల్ కర్మాగార కార్మికుల నిరవధిక నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 22వ రోజుకు చేరాయి. అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. 22 రోజులుగా కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నా కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడంపై కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నామని, కంపెనీని అర్ధాంతరంగా మూసివేయడంతో కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైన యాజమాన్యం స్పందించి కంపెనీని తెరవాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



బొండపల్లి: అవగాహన సదస్సుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు



మెరకముడిదాం: మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

బొండపల్లి: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకొచ్చిందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ చట్టాలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు 2013లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, అప్పుడే రక్షణ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, తహసీల్దార్ ఎన్.హనుమంతురావు, ఏపీఓ కృష్ణవేణి, ఏపీఎం కె.సులోచనాదేవి, ఈఓపీఆర్డీ సుగుణకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారిపై లైంగిక వేధింపుల నివారణ చట్టం–2013 ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పదిమంది, అంతకన్నా తక్కువ ఉద్యోగులు పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో మహిళలు లైంగిక వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదులకు కార్యాలయాల్లో ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై భాస్కరరావు

గుర్ల: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై భాస్కరరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు బానిసైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని, జీవితం నాశనమవుతుందన్నారు. యువత బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



మెరకముడిదాం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

మెరకముడిదాం: మాదకద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం పాడవడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడతాయని, జీవితాలు నాశనమవుతాయని బుధరాయవలస ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాలు వినియోగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



తహసీల్దార్ సుదర్శన్

దత్తిరాజేరు: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన కౌలు రైతులకు కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయాలని తహసీల్దార్ సుదర్శన్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశమై పలు సూచనలు చేశారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది 396 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది 480 మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని వీఏఏలు అర్హులైన కౌలురైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలని సూచించారు.

దశపత్ర కషాయంతో చీడపీడల నివారణ



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

వేపాడ: మండలంలో కుమ్మపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే దశపత్ర కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. సీతాఫలం, బొప్పాయి, ఆముదం, జామ, మారేడు, చింత, కలబంద, తదితర పది రకాల ఆకులు, ఆవుపేడ, గోమూత్రంతో కషాయాన్ని ఎలా తయారు చేయాలో మాస్టర్ ట్రైనీ సన్యాసమ్మ రైతులకు వివరించారు. కాండం తొలుచు పురుగు, పచ్చపురుగు నివారణకు ఈ ద్రావణం చాలాబాగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నారాయణమ్మ, ఈశ్వరరావు, మహిళా రైతులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో షెడ్ల నిర్మాణానికి కసరత్తు



మార్కెట్ స్థలంలో ఉన్న చెట్లను తొలగిస్తున్న దృశ్యం

గజపతినగరం: మండల కేంద్రంలోని కూరగాయల బజారులో కొత్తగా షెడ్‌లు ఏర్పాటు చేసేందుకు గ్రామ సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడుతో పాటు పంచాయతీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాబార్డ్ నుంచి రూ.15 లక్షలు, పంచాయతీ నిధుల నుంచి రూ.5 లక్షలు షెడ్ల నిర్మాణం కోసం మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులు చేపట్టలేకపోయామని, ప్రస్తుతం పనులు వేగవంతం చేశామని పంచాయతీ సెక్రటరీ రమణ తెలిపారు. గత కొన్నేళ్లుగా ఇదే స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారులకు షెడ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. మొత్తం 40 షెడ్ల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముందుగా ఈ ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించి స్థలాన్ని మార్కింగ్ పనులు చేపడుతున్నారు.

బుద్ధ, కల్కి అవతారాల్లో జగన్నాథుడు



కోళ్లబజారులో బుద్ధ, కల్కి అవతారాల్లో కొలువైన జగన్నాథుడు

విజయనగరం టౌన్: రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోళ్లబజారులో కొలువైన జగన్నాథుడు బుద్ధ, కల్కి అవతారాల్లో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు నగేషాచార్యులు విశిష్ట పూజలు నిర్వహించారు. అదే విధంగా ఉల్లివీధి కాళ్లనాయుడు రామమందిరంలో కొలువైన జగన్నాథుడు కూడా ప్రత్యేక అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ సాయి సంపత్ ఆచార్యులు, రామాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేపట్టారు.

సన్‌ఫ్లవర్ సాగు లాభదాయకం



సన్‌ఫ్లవర్ విత్తనాలు నాటే విధానాన్ని వివరిస్తున్న ఏఓ

చీపురుపల్లి రూరల్: సన్‌ఫ్లవర్ పంటసాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.రఘునాథ్ అన్నారు. మండలంలోని పేరిపి గ్రామంలో సన్‌ఫ్లవర్ 1012 విత్తన రకాన్ని గ్రామానికి చెందిన రైతు పొలంలో నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట 90 నుంచి 95 రోజుల్లో చేతికి అందుతుందని, హెక్టార్‌కు 1500 నుంచి 1800 కిలోల దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు విత్తనాలు వేసే ముందు 14 గంటలు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వరుస వరుసకి 45 సెంటీమీటర్లు, మొక్కమొక్కకి మధ్య 25 సెంటీమీటర్లు దూరం ఉండేలా విత్తుకోవాలని సూచించారు.

పొదుపు సంఘాల సుస్థిరతకు ప్రణాళికలు



మాట్లాడుతున్న ఏరియా కోర్డినేటర్ ఆదియ్య

గంట్యాడ: పొదుపు సంఘాలు సుస్థిరత సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను గ్రామైఖ్య సంఘాలు తయారు చేయాలని ఎస్.కోట ఏరియా కోఆర్డినేటర్ ఆదియ్య అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. చిరువ్యాపారాలు చేస్తూ మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేవిధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు కంటిపాక సీతమ్మ, ఏపీఎం శ్రీనివాస్, ఎఫ్‌పీఓ ఏపీఎం శైలేష్, సీసీలు చినబాబు, ముత్యాలనాయుడు, అచ్చెన్నాయుడు, గౌరీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో 'మా కే నామ్ పేడ్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లులచే మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు వితరణ

జామి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఆర్.బి.పురం గ్రామానికి చెందిన శ్రీఉమా విశ్వేశ్వరస్వామి ఆశ్రమ అధిపతి సాయినాన్న రూ.25 వేలు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని హెచ్‌ఎం అబ్దుల్ రహమాన్‌కు శుక్రవారం అందజేశారు. తన గురువు శ్రీరామానంద స్వామి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ మొత్తాన్ని అందజేసినట్లు చెప్పారు.

ట్రిపుల్ ఐటీకి గోషాడ విద్యార్థి ఎంపిక

గుర్ల: మండలంలోని గోషాడకి చెందిన దాసరి శ్యామ్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. పదో తరగతిలో 574 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తమ కుమారుడికి ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీపురవలసలో వైద్యశిబిరం



కొత్తవలస: వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న డీఐఓ అచ్యుతకుమారి

కొత్తవలస: మండలంలోని చీపురవలస గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తవలస పీహెచ్‌సీ వైద్యుడు సింహాద్రినాయుడు, సిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రజలకు వైద్య సేవలందించారు. జ్వరాలు, ఇతర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేసి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అచ్యుతకుమారి పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రత్నకుమారి, బేబీరాణి, సూరిదేముడు, ప్రశాంతి సేవలందించారు.

ఓబలయ్యపాలెంలో..



వేపాడ: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమాదేవి

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో శుక్రవారం బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జర్వాలు, ఇతర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్నవారికి డాక్టర్ రమాదేవి వైద్య సేవలందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం మలేరియా నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామపెద్దలు, సర్పంచ్ దివదారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాడిపశువులకు పచ్చిమేతే ఆధారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి హైమవతి

మెరకముడిదాం: పాడిపశువులకు పచ్చిమేతే ఆధారమని, పాడిపరిశ్రమ అభివృద్ధిలో పచ్చిమేత కీలక పాత్ర పోషిస్తుందని మెరకముడిదాం, గర్భాం పశువైద్య కేంద్రాల అధికారి సీహెచ్.హైమావతి అన్నారు.

మండలంలోని సాతాంవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పశుగ్రాస సాగుకు పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ ఎ.విజయలక్ష్మి, ఎల్‌ఎస్‌ఏ జి.శంకరరావు, వెటర్నరీ అసిస్టెంట్లు పి.శంకరరావు, పి.సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

దత్తిరాజేరు: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, లైసెన్స్, సీబుక్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్.భూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై యువతకు అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై అపరాధ రుసుం విధించడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 13న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ ఆర్.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవుపల్లి ఫీడర్ పరిధిలోని దేవుపల్లి, గొల్లుపాలెం, బి.రాజేరు, చిన్నతారామరాపల్లి, జి.పి.అగ్రహారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే విద్యుత్ వైర్లను తాకుతూ ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

● జామి: జామి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లు మెంటినెన్స్ పనుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దేముడుబాబు తెలిపారు. జామి పట్టణం, పి.భీమసింగి, శాఖపల్లి, వెన్నె, జన్నివలస, తానవరం, కొట్టాం, జాగరం, లక్ష్మీపురం, పావాడ, వీరభద్రపేట, వి.ఆర్.పాలెం, సోమయాజులపాలెం తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు సమీపంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు కారణంగా మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఐ.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగుబూడి జంక్షన్, గనివాడ, గోల్డుస్టార్ జంక్షన్, గేదులవానిపాలెం, వేచలపువానిపాలెం, జమ్మాదేవిపేట, దాసుళ్లపాలెం, రంగాపురం, మార్లాపల్లి, లింగంపేట, చందులూరు, రెల్లిగౌరమ్మపేట, శ్రీరాంపురం, తామరాపల్లి, మల్లివీడు, కొత్తపాలెం, కొత్తగంగుబూడి, కొత్తవలస మండలం ఉత్తరాపల్లి, నిమ్మలపాలెం, అప్పన్నపాలెం, చిన్నిపాలెం, జోగయ్యపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్(33/11కేవీ) పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేపట్టనున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శివకుమార్ తెలిపారు. గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం, మదుపాడ, మరుపల్లి, ఎం.గుమడాం, తమ్మారాయుడుపేట, గంగచోళ్లపెంట, పట్రువాడ, కొనిశ, మర్రివలస, పాతబగ్గాం, కొత్తబగ్గాం, సాలిపేట, చిట్టాయవలస, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, గుడివాడ, సీతారామపురం, పిడిశీల, పాతశ్రీరంగరాజపురం, కొత్తశ్రీరంగరాజపురం, ఎన్‌జీఆర్‌పురం, బూడిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మవరం, మామిడిపల్లి, వేములాపల్లి, గట్రాజు కళ్లాలు, కొట్టాం, గోపాలపల్లి, సీతారాంపురం, చామలాపల్లి, సన్యాసయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఆదిత్య తెలిపారు.